# నాకోసం నేను

- డా. ఉమ ఇయ్యుణ్ణి

ఇది కథ కాదుస్మా! అనుభవాత్మకమయిన ఆలోచన మాత్రమే!

"ఏమయింది మాలతీ, అంత దీర్ఘంగా ఆలోచిస్తున్నావు?" ఫోనులో మాట్లాడాక, ఆబల్లదగ్గరే నిల్చుండి పోయిన భార్యని అడిగాడు మూర్తి.

"ఏం చెయ్యాలో తోచడంలేదు. ఎన్నాళ్ళుగానో ఎదురు చూస్తున్న రేడియో టాక్ పదో తారీకున మూడు గంటలకు ఇచ్చారు. " "అయితే వెళ్ళు" వెంటనే అనేశాక గుర్తొచ్చింది మూర్తికి. ఆరోజునే నాలుగింటికి కొడుకు కోడలు వస్తున్నారు. వాళ్ళు అమెరికాలో స్థిరపడి, రెండు సంవత్సరాలకి ఒకసారి వస్తూ ఉంటారు. ముందు బొంబాయిలో దిగి, అనిత వాళ్ళ అమ్మనాన్నల దగ్గర నాలుగురోజులుండి, అప్పుడు చెన్నై వస్తారు. అక్కడో వారం ఉండి, వాళ్ళు వెళ్ళవలసిన చోట్లన్నీ చూసుకుని, మళ్ళీ ఓ రెండు రోజులు మూర్తి, మాలతితో ఉండి వెళ్ళిపోతారు.

ఒక్క రెండు గంటలు తను ఉండదంటే, ఇందులో ప్రోబ్లెం ఏముంది, అనుకున్నాడు మూర్తి. కాని మాలతి దిగాలుగా కూర్చుండి పోయింది.

ఈ అవకాశం చెన్నైలో తెలుగు టాక్ రావడం తనకి అపురూపం. అలాగని, కొడుకు కోడలు రాగానే ఇంట్లో ఉండక పోవడానికి మనస్కరించడం లేదు.

"చూడు మాలతీ, నువ్వేం ఊరు వదలి వెళ్ళిపోవడం లేదుగా, నేను ఎయిర్ పోర్ట్‌కి కారు తీసుకుని వెళ్తాను. నువ్వు ఆటోలో వెళ్ళి రా. నువ్వు కాస్త లేటుగా ఇంటికొస్తావు, అంతేకదా."

ఎంతో అనునయంగా చెప్పిన మూర్తి మాటలు మాలతికి ధైర్యాన్నిచ్చాయి.

సరె ఆరోజు రానే వచ్చింది. మనసు సగం పీకుతున్నా, ఎలాగో ప్రోగ్రాంకి వెళ్ళింది మాలతి. తల్లి కనబడక పోయేసరికి, అనిల్ "అమ్మేది నాన్నా?" అని అడిగాడు. "రేడియో టాక్ ఉందని వెళ్ళిందిరా, మనం ఇంటికెళ్ళి రిలాక్స్ అయ్యే వేళకి వచ్చేస్తుంది." అన్నాడు మూర్తి.

"అదేంటి డాడీ, అంత దూరంనుంచి మేం వస్తే, ఇంట్లో లేకుండా అమ్మకి అంత తన ప్రోగ్రాం అంత ముఖ్యమా?" చిన్నబుచ్చుకున్న కొడుకు మొహం చూస్తే జాలికి బదులు ఆశ్చర్యం వేసింది మూర్తికి. గత ఆరేళ్ళుగా ఉన్న ఒక్క కొడుకూ అమెరికాలో ఉండిపోతే, వాళ్ళ రాక కోసం కళ్ళలో వత్తులు వేసుకుని ఎదురు చూసే మాలతి, తన ప్రోద్బలంతోనే, రచనా వ్యాసంగాన్నీ, ఒక సీనియర్ హోంలో వాలంటీర్ పనిని మదలుపెట్టింది. ఆసంగతి కొడుక్కి కూడా తెలుసు. మరి అలా మొహం ముడుచుకున్నాడేమిటి? ఆతరువాతి వారం సరదాగా గడిచిపోయినా, మధ్యమధ్యలో అనిల్ మాలతిని ఏదో విధంగా దెప్పుతూనే ఉన్నాడు. "అనితా, మా అమ్మ చాలా మోడర్న్ వుమన్ అయిపోయింది తెల్సా?" చివరికి అనిత ఉండబట్టలేక, "అదేమిటి అలా అంటారు? వాళ్ళొచ్చినప్పుడు మీరు మీటింగ్స్ మిస్ అవలేదుకదా. దిస్ ఈస్ ఇంపార్టెంట్ ఫర్ హర్" పాపం, ఆ అమ్మాయికి భర్త ప్రవర్తన నచ్చలేదు.

ఇది కథ కాదు. అభూత కల్పన అంతకన్నా కాదు.

సగటు తెలుగు కుటుంబాలలో ఆడపిల్లలు, ముఖ్యంగా మధ్యతరగతి కుటుంబాలలో, ఏభయ్యి, అరవయ్యేల్లో పెరిగినవాళ్ళు, చిన్నప్పుడు ఆకు చాటు పిందెల్లా అమ్మనాన్నల కోసం, పెళ్ళయ్యాక భర్త అనుమతికోసం, ఇంకా పెద్దవాళ్ళయ్యాక పిల్లల కోసం బతికేస్తారు. అందులో ప్రత్యేకించి తప్పేమి లేదు, కాని కాస్త మధ్యవయస్కులయ్యాక, పిల్లలు ఎవరి గూళ్ళు వాళ్ళు వెతుక్కున్నాక, "ఇది నేను" అని అనుకోవడంలో తప్పేముంది? ఒక మధ్య వయసు, మంచి ఇల్లాలి ఆవేదన. ఇన్నాళ్ళూ నోరుమూసుకుని చేసేవి పనులే, కాని ఇప్పుడెందుకు మనసు ఎదురు తిరుగుతోందీ అని ఎక్కడో ఏదో అపశృతి వినపడుతోంది ఎందుకూ అని!

వికసించిన వ్యక్తిత్వం ఉన్న ఏ అమ్మమ్మ కయినా, అమ్మకయినా, నాన్నకయినా, తాతకయినా పిల్లలు పెరుగుతున్నప్పుడు బాధ్యతల వలయాల్లో చిక్కుకుని, తమవి అన్న కోరికలను, ఆశయాలను, మనసు పొరల వెనుక దాచుకోవడం సహజం. అది కుటుంబ బాధ్యత కూడా. అయితే, కొన్ని ప్రాధమిక సమస్యలను తీర్చుకున్నాక, తమకోసం తాము బ్రతకాలనుకోవడంలో తప్పేముంది? బహుశా ఈ గుర్తింపు వల్లనే అనుకుంటాను, ప్రస్తుత సమాజంలో ఇండియాకి, అమెరికాకి మధ్యన మనవలు, మనవరాళ్ళకోసం రవాణా అవుతున్న అమ్మమ్మలు, బామ్మలు మధన పడుతున్నారు. పంతొమ్మిదివందల అరవై, డెభైల్లో వలస వచ్చిన మనవాళ్ళకి పక్క వూళ్ళో స్నేహితులు, ఎదురింటి అమెరికన్లూ మాత్రమే దిక్కూ, తోడూను. ఇప్పుడు కంప్యూటర్ల కాలంలో పొయ్యిమీద నూనె పెట్టి, పచ్చడిలో ఏ పోపు వెయ్యాలో అర్జెంటుగా అమ్మకి ఫోన్ చెయ్యొచ్చు. ఆవిడ కర్మంచాలక దొరక్కపోతే అలగనూవచ్చు. సాంకేతిక నైపుణ్యం సమాజానికి ఎంత అవసరమో, అమ్మలకి అంత ఇబ్బందికరం అయిపోయిందంటే అతిశయోక్తి కాదుస్మా! అమ్మలూ, మా పిల్లల్ని మేం పెంచుకున్నాం, మీ పిల్లల్ని కూడా ఎక్కడ పెంచమే? అన్న అమ్మ ఎంత స్వార్థపరురాలు? మరి నేను కెరీర్ వదులుకోవాలా? అనే కోడలు, ఏమిటమ్మా, మా ఫ్రెండ్స్ అందరూ వాళ్ళ పిల్లల్ని అమ్మల దగ్గర, అత్తలదగ్గర వదలడంలేదూ? అనే కూతురూ అలగరు మరి? ఇప్పటి రోజుల్లో ఎదురు తిరుగుతున్న మనసుని అదుపులో పెట్టుకోవాలా? ఏదో పాపం పిల్లలకోసం తపన పడాలా? ఉన్న కాస్త జీవితం ఇన్నాళ్ళకి నాకోసం బతుకుతాను అనుకోవాలా? ఎన్నాళ్ళుగానో కలలు కన్న పెయింటింగ్ క్లాసుల్లో చేరిన రోజు, మనసు రెక్కలు విప్పుకున్న విహంగమయిన సుశీల. ఎన్నేళ్ళ తరువాతో తన కథ ఆలిండియా రేడియోలో చదివడానికి అవకాశం వస్తే పురివిప్పిన నెమలిలా నాట్యమాడిన మాలతి మనసు, అరవయి ఏళ్ళ వయసులో చిన్నప్పటినుండి చేద్దామనుకున్న సీనియర్ హోంలోని స్వఛ్ఛంద సేవకు వెళ్ళిన రావుగారు, వీరందరూ "నాకోసం నేను, నా మనసు కోరిన విధంగా నేను బ్రతకాలి అని అనుకోవడం ఎంతో సహజం, అలాగ చెయ్యగలగడం వారి హక్కుకూడా!!!!!